క్లుప్తంగా

విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన కందుకూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

పెద్దతిప్పసముద్రం: జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీలను నిర్వహించారు. మండలంలోని కందుకూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు బావాజాన్, సైఫ్ అలీ, శ్రీనిధి ద్వితీయ స్థానం సాధించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సైన్స్ టీచర్‌ను హెచ్ఎం మల్లయ్య అభినందించారు.

గంగమ్మ ఆలయానికి రూ.10 వేల విరాళం



విరాళం అందజేస్తున్న ఎంఈవో తాతయ్య

పీలేరు రూరల్: మండలంలోని తలపుల పంచాయతీలోని ఉలవల గంగమ్మ ఆలయానికి పులిచెర్ల ఎంఈవో పి.తాతయ్య రూ.10 వేల విరాళం అందజేశారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణనాయుడు, హరినాథ్‌నాయుడు, సాగర్ రెడ్డి, మల్లికార్జున నాయుడు, అర్చకులు గణేష్ రాజు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం అధ్యక్షుడిగా రెడ్డెప్ప



ఎన్నికైన అధ్యక్షుడు రెడ్డెప్ప, సభ్యులు

రామసముద్రం: రామసముద్రం మండల వడ్డెర సంఘం నూతన గౌరవాధ్యక్షుడిగా కోనంగి వెంకటప్ప, అధ్యక్షుడిగా కమతంపల్లికి చెందిన రెడ్డెప్పను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ సందర్భంగా రెడ్డెప్ప మాట్లాడుతూ వడ్డెరల సమస్యల కోసం శక్తి వంచన లేకుండ కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వడ్డెరలు పాల్గొన్నారు.

అధ్యాపకులకు ఆన్‌లైన్ పరీక్ష



ఆన్‌లైన్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

కురబలకోట: మద్రాస్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్హాన్స్‌డ్ లర్నింగ్ ఎన్‌పీటీఈఎల్) పేరిట మూడు రోజుల పాటు సర్టిఫికేషన్ కోర్సుకు ఆన్‌లైన్ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఈ పరీక్షలకు వివిధ ప్రాంతాల నుంచి 3734 మంది అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. ప్రిన్సిపల్ యువరాజ్ మాట్లాడుతూ ఏడాదికి రెండు మార్లు ఈ పరీక్షలు నిర్వహిస్తారని, ఉత్తీర్ణులైన వారికి ఎన్‌పీటీఈఎల్ వారు సర్టిఫికెట్ అందిస్తారని తెలిపారు. అదే విధంగా మిట్స్ కళాశాల బీటెక్ విద్యార్థులు పి.ఇందు, జె.జయశ్రీ జేఎన్‌టీయూ కబడ్డీ టీమ్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో దుర్గా పూజ



సంప్రదాయ దుస్తుల్లో సీఐ, ఎస్ఐ, పోలీసులు

కలకడ: అందరూ బాగుండాలి..అందరిలో మేమూ ఉండాలి.. అందరికీ మంచి జరగాలని కోరుతూ కలకడ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం దుర్గాపూజ నిర్వహించారు. తమ వాహనాలు, పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని శుభ్రం చేసి రంగు రంగుల దీపాలతో అలంకరించారు. అనంతరం అన్నదానం జరిపారు. ఈ సందర్భంగా పోలీసులు, అధికారులు యూనిఫాం వదిలి తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పంచలు, మహిళలు చీరలు ధరించి కార్యక్రమానికి హాజరు కావడంతో పండగ వాతావరణం కనిపించింది. ఈ కార్యక్రమంలో సీఐ గురునాథ్, ఎస్ఐ రామాంజనేయులు, పోలీసులు, వారి పిల్లలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌పై ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో విద్యుత్ స్తంభం కూలి సరఫరా నిలిచిపోయింది. పర్యాటక కేంద్రం కావడంతో సరఫరాను తక్షణమే పునరుద్ధరించేందుకు లైన్‌మన్ రామలింగారెడ్డి, సిబ్బంది పనులు చేపట్టారు. కురబలకోట నుంచి కొత్తగా విద్యుత్ స్తంభాన్ని తెప్పించారు. దెబ్బతిన్న వైర్లను సరిచేసి కొత్త స్తంభం ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.


బండలు పగిలి.. గోడలు పడిపోయి

హాకీ క్రీడాకారులకు పుట్టినిల్లు అయిన మదనపల్లిలో ప్రస్తుతం హాకీ స్టేడియాన్ని పట్టించుకునే నాథుడే కరవయ్యారు. మైదానం చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. కూర్చునేందుకు వేసిన బండలు పగిలిపోయాయి. ప్రహరీగోడలు పడిపోవడంతో బోసిపోయి కనిపిస్తోంది. క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- మదనపల్లి పట్టణంలోని హాకీ స్టేడియం దుస్థితి ఇదీ..
- హాకీ స్టేడియంను పట్టించుకోని అధికారులు
- మైదానం లేక ఇబ్బంది పడుతున్న క్రీడాకారులు



జినరాసదస హాకీ స్టేడియం



మైదానంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

మదనపల్లె సిటీ: హాకీ క్రీడాకారులకు పుట్టినిల్లు మదనపల్లె. ఇక్కడ ఎంతో మంది జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో హాకీ క్రీడల్లో రాణించి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారు. 1915లో అప్పటి ఐరిష్ వనతి డాక్టర్ అనిబిసెంట్ మదనపల్లెలో బీటీ కాలేజీ నిర్మించారు. హాకీ క్రీడాకారుల కోసం 1952లో జిన రాజదస స్టేడియం ఈ కళాశాలలోనే ఏర్పాటు చేశారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని అప్పట్లోనే ఈ హాకీ మైదానం నిర్మించారు. ప్రముఖ హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్ ఇక్కడే పలువురికీ హాకీ క్రీడ నేర్పించారు. అప్పటి భారత హాకీ కెప్టెన్ ముఖేష్‌కుమార్ కూడా ఇక్కడ పోటీల్లో పాల్గొన్నారు. ఎంతోమంది జాతీయ క్రీడాకారులు ఇక్కడ హాకీ నేర్చుకున్నారు. ఇంతటి ఘన చరిత్ర ఉన్న ఈ స్టేడియంలో ఏటా త్రిలోకికర్ హాకీ గోల్డ్‌కప్ పేరుతో జాతీయ స్థాయి పోటీలు జరిగేవి. ప్రస్తుతం మైదానం స్థితి బాగాలేక ఆ జాతీయ స్థాయి పోటీలు నిలిచిపోయాయి.

గోతులమయమైన మైదానం

మదనపల్లి హాకీ స్టేడియంలో జోనల్ స్థాయి పోటీలు జరిగినప్పుడు మాత్రం మైదానం శుభ్రం చేస్తారు. దీంతో ప్రస్తుతం మైదానం కూడా ఆక్రమణలకు గురవుతోంది. గుంతలమయంగా మారడంతో క్రీడాకారులు ఆడుకోలేని దుస్థితి. వేసవిలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఇక్కడ హాకీ నేర్చుకోవడానికి పలువురు వస్తారు. అయినా బాగు చేయాలని ఎవరూ అనుకోవడం లేదు. పోటీలను చూసేందుకు ఏర్పాటుచేసిన పెవిలియన్ చుట్టూ బండలు పగిటాయి. కూర్చునేందుకు వీలు లేకుండా పోయింది. జిల్లా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక చొరవతో హాకీ స్టేడియానికి పూర్వ వైభవం కల్పించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ఉచిత సేవలను ప్రతి పల్లెకు విస్తరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న క్రిష్ణమూర్తి

కలకడ : మానవత సంస్థ అందించే ఉచిత సేవలను మరింత విస్తరించాలని ప్రత్యేక ఆహ్వానితుడు లక్ష్మిరెడ్డి, సంస్థ అధ్యక్షుడు పివి.నాయుడు కోరారు. కె.బాటవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవత సంస్థ సమావేశంలో వారు మాట్లాడుతూ గత నెలలో 176మంది మాత్రమే సంస్థ సభ్యులుగా చేరారన్నారు. ప్రతి గ్రామంలో పర్యటించి మరింత మందిని సభ్యులుగా చేర్చుకోవాలని కోరారు. సంస్థ కార్యాలయం వద్ద ప్రాగణం బోర్డు నిర్మించాలని, దాతలు ఇచ్చిన వితరణ భద్రపరచాలని సూచించారు. గంగాద్రినాయుడు, శ్రీనివాసులురెడ్డి, వైవి.రమణ, నీళ్ల భాస్కర్, వెంకటేశ్వరరావు, జయప్రకాష్, ఖాజాపీర్, సయ్యద్‌సాహెబ్, వెంకటసుబ్బయ్య, మోహన్, జీవిరమణ పాల్గొన్నారు.

వాల్మీకిపురం: మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకెళ్దామని మానవతా సంస్థ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి అన్నారు. స్థానిక సత్యసాయి సేవా మందిరంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలతోపాటు యువతలో సేవాభావం పెంపొందే విధంగా అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. మానవతా సంస్థలోకి మరింత మంది విశ్రాంత ఉద్యోగులు, యువకులు తరలిరావాలని కోరారు. మొక్కలు నాటడంతోపాటు పలు సేవా కార్యక్రమాల్లో ముందుకెళ్తున్నామన్నారు. నీళ్లభాస్కర్, ఆనంద శెట్టి, లక్ష్మన్న, మురళి, రామక్రిష్టారెడ్డి, రమణమూర్తి, నారాయణ శెట్టి పాల్గొన్నారు.

కలకడ: వినూత్న సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని పీలేరు సంస్థ అధ్యక్షుడు శెట్టి సుబ్రహ్మణ్యం కోరారు. పీలేరు ఆర్యవైశ్య కళ్యాణమండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో మానవతా విలువలు పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.జగన్ మోహన్, సురేష్, కృష్ణమూర్తి, వెంకటరమణ, నాగరాజ, రామక్రిష్ణ, అహమ్మద్, అశోక్ పాల్గొన్నారు.

సిబ్బందికి ఈ నెల జీతాలు అందేనా?

పెద్దతిప్పసముద్రం: కూటమి ప్రభుత్వంలో అధికారుల బదిలీలు గందరగోళంగా మారడంతో సచివాలయ ఉద్యోగులకు జీతాల బిల్లులు పెట్టుకునే అవకాశం లేకుండా పోయింది. మండలంలోని మూడు గ్రామ సచివాలయాల్లో పని చేసే సిబ్బంది ఈ నెల జీతాలు వస్తాయో.. లేదోనని అయోమయంలో పడిపోయారు. వారికి సంబంధించిన నెల జీతాల బిల్లులు పంపకపోవడమే ఇందుకు కారణం. ఉద్యోగులకు సాధారణంగా ప్రతి నెలా 25వ తేదీలోగా జీతాల బిల్లులు పెట్టుకోవాల్సి ఉంటుంది. సచివాలయాల పరిధిలో పంచాయతీ కార్యదర్శులే డీడీఓలు కావడం, సదరు కార్యదర్శులు ఇటీవల బదిలీపై వెళ్లిపోవడంతో బిల్లులు పెట్టలేకపోయారు. మండలంలోని టి.సదుం, నవాబుకోట, తుమ్మరకుంట గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులుగా పని చేస్తున్న సురేంద్రబాబు, విష్ణుప్రియలు వేరే మండలాలకు బదిలీపై వెళ్ళిపోయినా ఇంత వరకు వారి స్థానంలో ఇంకా ఎవరినీ ప్రత్యామ్నాయంగా నియమించలేదు. తద్వారా ఈ మూడు సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బందికి వేతనాల మంజూరు ప్రశ్నార్థకంగా మారింది. మండల స్థాయి అధికారులు స్పందించి చిరుద్యోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన బిల్లులు పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దేవుని యందు భయభక్తులు కలిగి జీవించాలి

- నాచారం చర్చి ఫాస్టర్ ఎబినేజర్



అంగళ్లు చర్చిలో బోధిస్తున్న ఫాస్టర్ ఎబినేజర్

కురబలకోట: దేవుని యందు భయ భక్తులు కలిగి జీవించాలని హైదరాబాద్‌ని సీయోను ప్రార్థనామందిరం చర్చి ఫాస్టర్ ఎబిజేజర్ అన్నారు. నియోజకవర్గంలోని అంగళ్లు సీయోను ప్రార్థన మందిరంలో జరిగిన ఆరాధన, బల్ల వర్తమానం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భక్తి ఉంటే పాపాలు పోగొట్టుకుని రక్షణ పొందుతారని, భయం ఉంటే పాపం జోలికి వెళ్లరని అన్నారు. పరిశుద్ధత లేకుండా దేవునికి దగ్గర కాలేరన్నారద్దీ కార్యక్రమంలో ప్రధాన ఫాస్టర్ విక్టర్ వేదనాయక్, సహ పాస్టర్లు శామ్యూల్, జయరాజ్‌రెడ్డి, భాస్కర్, మూలింటి నాతానురెడ్డి, నెహెమ్యా, తిమోతి, తదితరులు పాల్గొన్నారు.

రచయిత రామచంద్రయ్య మృతి తీరని లోటు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ రచయిత టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి

మదనపల్లె సిటీ: టెలికాం మాజీ డిప్యూటీ జనరల్ మేనేజర్, రచయిత రామ చంద్రయ్య మృతి తీరని లోటు అని ప్రముఖ రచయిత టీఎస్ఎ.క్రిష్ణమూర్తి అన్నారు. ప్రజా చైతన్య ప్రవంతి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రశాంత్ నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ఆదివారం రామచంద్రయ్య సంస్మరణ సభ జరిగింది. క్రిష్ణమూర్తి మాట్లాడుతూ బహుబాషా ప్రవీణులు, రచయిత, గ్రంథకర్త, చిత్రకారులు, కళాకారులుగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు, కార్యదర్శి నాగభూషణరావు, రచయితలు కనకసభాపతి, మోహన్‌వల్లి, రెడ్డప్ప, వీఎం.నాగరాజ, వాసా క్రిష్ణమూర్తి, శ్రీధర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో కుక్కల బెడద



పీలేరు పట్టణంలో ఎటుచూసినా కుక్కలు హల్‌చల్ చేస్తుండడంతో ప్రజలు భయపడుతున్నారు. పట్టణంలోని మాంసపు దుకాణాలు, టీస్టాళ్లు, ఆర్టీసీ బస్టాండ్, వారపు సంతతోపాటు ప్రధాన కూడళ్లలో కుక్కల బెడద ఎక్కువైంది. పంచాయతీ అధికారులు కుక్కల పట్టే కార్యక్రమం చేపట్టినా యథావిధిగా కుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి. – పీలేరు

నగరవనం అభివృద్ధికి సహకారం అందిస్తాం

మదనపల్లె: పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, ఆరోగ్యాన్ని అందించే నగరవనం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. పట్టణంలోని బసినికొండ అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నగరవనాన్ని ఎఫ్ఆర్ఓ వేణుగోపాల్‌బాబుతో కలిసి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదివారం సందర్శించారు. రూ.2 కోట్ల నిధులతో అభివృద్ధి చేసిన నగరవనం పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నపిల్లల కోసం పార్కు, పెద్దల కోసం వాకింగ్ ట్రాక్, బుద్ధ ఫౌంటెయిన్, యోగా సెంటర్ అభివృద్ధి చేస్తున్నట్లు ఎఫ్ఆర్ఓ వేణుగోపాల్‌బాబు వివరించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంక్రీట్ జంగిల్ లాంటి నగరాల్లో... కనుచూపు మేర పచ్చదనం, అడవిని తలపించేలా పరిసరాలు, ఆహ్లాద పరిచే చల్లనిగాలులతో ఆకట్టుకునేలా నగరవనం నిర్మాణం జరుపుకోవడం అభినందనీయమన్నారు. రాటకొండ గుర్రప్పనాయుడు, రాజా, జేసీబీ వేణు, రెడ్డిరాయల్, సురేంద్రరెడ్డి, రఘుపతినాయుడు, నాయక్ ం పాల్గొన్నారు.

రహదారి సమస్యకు పరిష్కారం

మండలంలోని కొండామారిపల్లె పంచాయతీ ఇసుకనూతిపల్లె గమ్ ఫ్యాక్టరీ సమీపంలో 30 ఏళ్లుగా వినియోగిస్తున్న రహదారి సమస్యను అధికారులు ఆదివారం పరిష్కరించారు. దారిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ స్థానికులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు విన్నవించడంతో సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆదివారం ఉదయం అధికారులు జేసీబీ సాయంతో రోడ్డు బాగుచేయించడంతో కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జయరాంయాదవ్, వెంకటరమణయాదవ్, కృష్ణమూర్తి, మాజీ ఆర్మీ ఉద్యోగి సుధాకర్ పాల్గొన్నారు.



అటవీ అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఇలా ఉంటే రోగాలు రావా?



చెత్తా చెదారంతో కలుషితమవుతున్న నీరు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పోతుపేటలో తాగునీటి పైపులకు లీకేజీ ఏర్పడి నీరంతా కలుషితం అవుతోంది. లీకేజీలు ఏర్పడిన ప్రాంతంలో చెత్తా చెదారం నిండుకున్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి లీకేజీలను అరికట్టాలని వారు కోరుతున్నారు.

ఇసుక పాలసీని ప్రభుత్వం పర్యవేక్షించాలి

రాజంపేట రూరల్ : ఉచిత ఇసుక విధానం మాఫియా బారినపడి రాష్ట్రం నుంచి తరలిపోకుండా నిరంతరం ప్రభుత్వ అధికారులతో పర్యవేక్షించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఆదివారం తాపీ మేస్త్రీలు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టంను అమలు చేస్తే కార్మికులకు ఎంతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చట్టంను త్వరగా అమలు చేయాలని కోరారు. ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలలో కార్మికులు ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఈ.సికిందర్, నాయకులు నరసింహ, పి.సుబ్రమణ్యం, నన్నేసాబ్, జయరాం, నాగభూషణం, గోవింద్, ఎం.గంగన్న, తిప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అభిరుచిని పెంపొందించుకోవాలి



విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

రాయచోటి అర్బన్ : ప్రతి విద్యార్థి సైన్స్‌పట్ల అభిరుచిని పెంపొందించుకోవాలని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) ప్రిన్సిపల్ జ్యోతిర్మయి అన్నారు. ఆదివారం స్థానిక డైట్ సభా భవనంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహింపబడ్డాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించుకోవడానికి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.ఓబులరెడ్డి మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీలు నేటి ప్రపంచాన్ని శాసిస్తున్నాయన్నారు. విద్యార్థులు వాటిలో నైపుణ్యం సాధించాలంటూ కోరారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, కంటివైద్యుడు రెడ్డెన్నలు మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన విద్యార్థులకు ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థి దశలో బాగా కష్టపడినవారు జీవితంలో బాగా స్థిరపడ్డారన్నారు.

జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ నవంబరు 9,10 తేదీలలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు రెండుజట్లను ఎంపిక చేశామన్నారు. కాగా ఈ పరీక్షలో 30 మండలాల నుంచి 42 టీంలు, 126 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ప్రభుత్వ పాఠశాలల విభాగం నుంచి ధీరజ్, కార్తీక్, లహరిలు, ప్రైవేటు స్కూల్ విభాగం నుంచి చందు, మనస్విని, సాయి సంతోష్‌లు ఎంపికై నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శివయ్య, రామక్రిష్ణ, జిల్లా కమిటీ సభ్యులు ఆంజనేయులు, రామయ్య, ప్రతాప్‌రెడ్డి, శివారెడ్డి, గౌస్‌బాషా, నాగేశ్వరరావు, అరవింద్‌రెడ్డి, జయచంద్ర, శాస్త్రీ, సుభాషిణి పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన అమ్మవారి ఆలయాలు



గంగమ్మ

లక్కిరెడ్డిపల్లి : అనంతపురం గంగమ్మకు ఆదివారం వేలాది మంది భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న గంగమ్మ దర్శనానికి భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలైన్‌లో వేచివున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా మారి చిన్నపాటి జాతరను తలపించింది. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ఆలయ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఆలయ పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

రెడ్డెమ్మకొండ.. భక్తులతో కిటకిట



సంతాన ప్రాప్తి కోసం అమ్మవారి ఎదుట మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. రెడ్డెమ్మతల్లీ.. చల్లంగా చూడు తల్లీ అంటూ భక్తులు అమ్మవారిని వేడుకుంటూ మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం వేకువ జామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతాన ప్రదాయినిగా ప్రసిద్ధి పొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. పరిసరాల్లోని దిగువ తొట్లివారిపల్లెలో అర్చకుల కుటుంబీకులు పంపిణీచేసే ఆకు పసరు తాగి మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించిచారు. తడిబట్టలతో అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు బంగారు, వెండి, చీరె సారె సమర్పించి మొక్కుబడులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తి శ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. హిందువులతోపాటు ముస్లింలు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు అని ఏర్పాట్లు చేశారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా వేణుగోపాల్



వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న ఆర్య వైశ్య సంఘం నాయకులు

పీలేరు: ఆర్య వైశ్య సంఘం పీలేరు అధ్యక్షుడిగా బలసా వేణుగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలసా వేణుగోపాల్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం సభ్యుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడిని సత్కరించారు. అరవింద్‌బాబు, కూనా సత్యనారాయణ, వెంకటేష్, సురేష్, రాజేష్, తులసి, మహేష్. చెంగయ్య, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

డెయిరీ తెరవక.. గిట్టుబాటు లేక



వెలిగల్లులో మూతబడిన జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘం


- నిరుపయోగంగా పరికరాలు
- రోజూజూ 5 వేల లీటర్ల పాల సేకరణ

పెద్దమండ్యం: మండలంలోని పాడి రైతులకు గత ప్రభుత్వం బాసటగా నిలిచింది. ప్రైవేటు డెయిరీలతో నష్టపోతున్న వారికి లాభసాటిగా ఉన్న పాలశీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేసి పాలకు గిట్టుబాటు కల్పించింది. అయితే ఇటీవల కేంద్రం మూసివేయడంతో పాడి రైతులు తిరిగి ప్రైవేటు డైరీలను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది. గిట్టుబాటు ధర లేకపోవడంతో ఆవుల పోషణకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మండలంలోని వెలిగల్లులో జగనన్న పాలవెల్లువ పేరుతో మహిళా డెయిరీ సహకార సంఘాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసింది. తొలి విడతగా ఈ డెయిరీ కింద 43 పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వెలిగల్లు, బండమీదపల్లె, శిద్దవరం, శివపురం, ఎన్‌వోపల్లె, కలిచెర్ల, కోటకాడపల్లె, గుర్రంవాండ్లపల్లె గ్రామాలలో రెండు మార్గాలుగా విభజించిరు. ఒక్కో రూట్‌కు ఒక ప్రత్యేక అధికారిని నియమించడంతో పాడి రైతులకు భరోసా కలిగింది. పాలు పోసే రైతులకు లీటరుకు రూ.35 నుండి రూ.40 రూపాయల వరకు రాగా, గేదే పాలైతే రూ.70 రూపాయల నుండి రూ.75 రూపాయల వరకు గిట్టుబాటు ధర లభించేంది. శిద్దవరంలో ఎన్నికల కోడ్ రావడంతో కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు. ఈ డెయిరీ కింద పాపేపల్లె, బండ్రేవు పెద్ద మండ్యం, సీ గొల్లపల్లె, ముసలికుంట, గ్రామాలలో పలుచోట్ల మరో 40 పాల సేకరణ కేంద్రాలను గుర్తించగా, కొన్ని చోట్ల పరికరాలను అమర్చారు.

రోజువారీ 5 వేల లీటర్ల సేకరణ

43 పాల సేకరణ కేంద్రాల నుంచి రోజువారీ 5 వేల లీటర్ల నుండి ఆరు వేల లీటర్ల వరకు పాలను సేకరించారు. ఉదయం 2500 లీటర్లు, సాయంత్రం 2500 లీటర్ల పాలు డెయిరీకి వచ్చేవి. సేకరించిన పాలను వెలిగల్లు డెయిరీకి తరలించి పాడి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించారు. పాల సేకరణ కేంద్రాలలో అత్యాధునిక పరికరాలు ఉండడంతో వెన్న శాతం బట్టి గిట్టుబాటు ధర లభించేది. వెలిగల్లులో ఏర్పాటుచేసిన జగనన్న పాల వెల్లువ మహిళ సహకార సంఘం డెయిరీ మూతపడడంతో బండమీదపల్లె, పెద్దమండ్యం, గాలివీడు ప్రాంతాలలోని రెండు ప్రైవేటు డెయిరీలకు పాలు మళ్లించారు. ప్రభుత్వం ద్వారా నడుస్తున్న డెయిరీ లేక తమకు గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రైతులకు బాసటగా ఉండేది



గత ప్రభుత్వం పాడి రైతులకు బాసటగా నిలిచింది. వెలిగల్లులో పాలశీతల కేంద్రం ఏర్పాటు కావడంతో చుట్టూ గ్రామాల పాడిరైతులకు ఒక భరోసా కలిగింది. రోజువారీ 5 వేల లీటర్ల వరకు పాలను సేకరించేవారు. ఇటీవల కేంద్రాలను మూతవేశారు. దీంతో పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఉన్నట్టుండి పాలశీతల కేంద్రం మూత వేయడంతో పాడి రైతులు ప్రవేటు డైరీలను తిరిగి ఆశ్రయిస్తున్నారు.

– సి సరస్వతి, గ్రామ సర్పంచ్, వెలిగల్లు

గిట్టుబాటు ధర లభించేది



వెలిగల్లు జగనన్న పాలవెల్లువ మహిళా సహకార సంఘం డెయిరీకి పాలు పోయడంతో గిట్టుబాటు ధర లభించేది. ఆవు పాలకు లీటరుకు రూ.35 నుండి 40 వరకు వచ్చేది. గేదె పాలైతే లీటరుకు రూ.70 నుండి 75 రూపాయలు వచ్చేది. పాల సేకరణ కేంద్రానికి అత్యాధునిక పరికరాలు రావడంతో వెన్నశాతం బట్టి ధర లభించేది. పాలశీతల కేంద్రం ఇటీవల మూత బడడంతో ప్రైవేటు డైరీలను రైతులు ఆశ్రయిస్తున్నారు.

– శ్రీనివాసులు రెడ్డి, పాడి రైతు, నడింబురుజు